నేడు రాజీవ్ గృహకల్ప సంక్షేమ సంఘం ఎన్నికలు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. అధ్యక్షుల రేసులో గార్లపాటి ప్రభాకర్, తల్లోజు శ్రీనివాస్ ఆచారి, ధర్మారపు అంజయ్య, యువరాజ్, ప్రధాన కార్యదర్శులుగా లక్ష్మణ్, గుదే వెంకటేష్, ముచ్చెంతల భూపతిరెడ్డి, అరుణ్ కుమార్ పోటీలో ఉన్నారు. చేసిన మంచి పనులే తమను గెలిపిస్తాయనే కొందరు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సుమారు 1500పైగా ఓట్లు ఉన్నాయి.

జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశం బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కేతూరి నర్సింహ సీపీఓ ఐటీ సెల్‌కు బదిలీ అయ్యారు. జగద్గిరిగుట్ట సీఐగా వచ్చిన వెంకటేశం ఇప్పటి వరకు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో డీఐగా విధులు నిర్వహించారు.

ఎంపీకి యజ్ఞ మహోత్సవ ఆహ్వానం



ఎంపీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శేఖర్ యాదవ్ తదితరులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న బ్రహ్మంగారి ఆలయంలో విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాన్ని ఈ నెల 17న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణులతో కలిసి యజ్ఞ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఎంపీ ఈటల రాజేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో హనుమంత చారి, శ్రీనివాస్ చారి, మనోహర్, శ్రీశైలం, వేణు చారి తదితరులు పాల్గొన్నారు

నేడు భగత్‌సింగ్‌నగర్ అడ్‌హక్ కమిటీ ఎన్నిక సమావేశం

చింతల్: భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎంపికకు ఆదివారం భగత్‌సింగ్ నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి పచ్చమట్ల నరేందర్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు అఖిలపక్షం సమావేశం ఉంటుందని, విద్యావంతులు, సీనియర్ నాయకులతో అడహక్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బస్తీ వాసులు హాజరై సహకరించాలని కోరారు.

సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతా



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని షిర్డీహిల్స్‌లో శనివారం పర్యటించారు. మంచినీటి, రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై స్థానికులు కార్పొరేటర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షిర్డీహిల్స్ ప్రెసిడెంట్ బండ మహేందర్, వేణుగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపికవ్వాలి



అభినందిస్తున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

సుభాష్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం బ్లూమ్స్ అకాడమీ మాస్టర్ కృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న 16 మంది విద్యార్థులు బెంగళూరులో జరుగనున్న నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. బెంగళూరు వెళ్తున్న తరుణంలో వారిని శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో అభినందించారు. జాతీయస్థాయిలో రాణించి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావాలని సూచించారు.

వర్షాకాలం.. వ్యాధుల భయం !

సాధారణంగానే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తుంటాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల వల్ల వచ్చే వ్యాధులు సంక్రమిస్తున్నాయి. దగ్గు, జలుబు, గొంతు, ఒంటి నొప్పులతో పాటు టైఫాయిడ్, మలేరియా, డెంగీ వ్యాధులు హడలెత్తిస్తున్నాయి. దోమల విజృంభణతో ప్రజలు వణికిపోతున్నారు. ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు విష జ్వరం బారిన పడి సతమతమవుతూనే ఉన్నారు.

విష జ్వరాలతో వైద్య కేంద్రాలకు క్యూ



దుండిగల్‌లో వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులు

దుండిగల్: వర్షాకాలంలో తరుచూ దగ్గు, జలుబు, తుమ్ములు, తలనొప్పి, గొంతు నొప్పి వస్తుంటాయి. వాటికి వైద్యుల సంరక్షణలో మందులు వాడితే సరిపోతుంది. కానీ జ్వరం వచ్చినప్పుడు మాత్రం ఐదు రోజులు మించితే రక్త పరీక్షలు చేయించుకోవాలి. ఇప్పటి వరకు 22 మంది డెంగీ



మురికిగుంటలో ఆయిల్ బాల్స్ వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సోకిందని, వైద్యుల పర్యవేక్షణలో వారందరు కోలుకున్నారని వైద్యాధికారిణి స్వర్ణలత తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నారు. ఎవరైనా డెంగీ బారిన పడితే వారి కుటుంబ సభ్యులతో పాటు చుట్టు ప్రక్కల ఉన్న వంద ఇళ్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతే ప్రధానం..

కురుస్తున్న వర్షాలకు వరద నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని దుండిగల్ మండల వైద్య, మున్సిపల్ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఇళ్లలోని కూలర్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, పాడైపోయిన సామగ్రి మధ్య ఉన్న నీటిలో లార్వా పెరిగి దోమలు వేల సంఖ్యలో వృద్ధి చెందే ఆస్కారం ఉంటుంది. దీంతో ప్రతి రోజు ఆయా చోట్ల ఉన్న నీటిని తొలగిస్తూ ఉండాలి.

ప్రజల్లో అవగాహన..

విష జ్వరాల బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. మురికివాడ ప్రాంతాల్లో వైద్య శాఖ అధికారులు ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్నారు. అదే విధంగా మున్సిపల్ అధికారులు ప్రతి శుక్రవారం 'ఫ్రై డే.. డ్రై డే', 'వంద రోజుల ప్రణాళిక' వంటి కార్యక్రమాలు చేపడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

దోమల నివారణకు చర్యలు

దోమలు వ్యాప్తి చెందకుండా దుండిగల్ మున్సిపాలిటీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో నీరు నిల్వ ఉన్న ఖాళీ ప్రదేశాలు, గుంతల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నారు. అదే విధంగా లార్వా పెరగకుండా యాంటీ లార్వా స్ప్రే చేస్తున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ అక్కడే బ్లీచింగ్ ఫౌడర్ చల్లుతున్నారు. వార్డుల్లో ప్రతి



వర్షంలోనూ వివరాలు నమోదు చేసుకుంటున్న ఆశా వర్కర్లు

రోజు ఫాగింగ్ చేస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో భారీగా నిర్మాణాలు వెలుస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో భారీగా గుంతలను తవ్వడంతో నీరు చేరి దోమల వృద్ధికి ఆస్కారం పెరుగుతుంది.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



మున్సిపల్ సిబ్బంది ప్రతి రోజు నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్, యాంటీ లార్వా స్ప్రే, ఫాగింగ్ చేస్తున్నారు. ప్రజలను సైతం అప్రమత్తం చేస్తున్నాం. స్థానికులు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా సహకరించాలి. ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమకు సమాచారం అందించాలి. – వెంకటేశ్వర్ నాయక్, కమిషనర్, దుండిగల్ మున్సిపాలిటీ

జాగ్రత్తలు తీసుకోవాలి



ఇళ్లలోని వంట పాత్రలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలి. ఎప్పటికప్పుడు వేడి వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. గోరు వెచ్చని నీటిని తాగాలి. ఎవరికైనా విష జ్వరాలపై అనుమానాలు ఉంటే వెంటనే స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి. వర్షాకాలం ముగిసే వరకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. – డాక్టర్ స్వర్ణలత, వైద్యాధికారిణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

డివిజన్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి



కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గిరినగర్ వాసులు

రంగారెడ్డినగర్: డివిజన్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం గిరినగర్ బస్తీ వాసులు కార్పొరేటర్‌ను కలిసి స్థానికంగా నెలకొన్న భూగర్భ డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. బస్తీలోని కొన్ని గల్లీల్లో తరచూ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పారుతోందని, దీంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నూతన పైపులైన్‌లు వేసి సమస్యను పరిష్కరించాలని, అదే విధంగా బస్తీలో అసంపూర్తిగా ఉన్న రోడ్లను వేయించాలని కోరారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

శ్మశానవాటికలో మెరుగైన సదుపాయాలు

సనత్‌నగర్: బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్ సమీపంలోని ధనియాలగుట్ట శ్మశానవాటికలో మెరుగైన సదుపాయాలతో పాటు అక్కడ భద్రతను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. శ్మశానంలో వ్యభిచార నిర్వహణ విషయం వెలుగులోకి రావడంతో అధికార యంత్రాంగాన్ని ఆమె అప్రమత్తం చేసి శనివారం వారితో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు ఇక్కడ క్లీనింగ్ పనులు చేపట్టాలన్నారు. హార్టికల్చర్ అధికారులు గ్రీనరీని మరింతగా పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు ప్రతిరోజూ ఇక్కడ పెట్రోలింగ్ విధులు నిర్వర్తించాలన్నారు.

ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిది



ఉపాధ్యాయులకు అవార్డు అందజేసి సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఉపాధ్యాయులే మన సమాజం యొక్క నిజమైన శిల్పులని, వారి కృషి వెలకట్టలేనిదని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ మండల గుర్తింపు పొందిన స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొంపల్లిలోని సెంట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలలో శనివారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే 20 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డులను అందజేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకులుగా ఉపాధ్యాయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. విద్యాభివృద్ధికి తన వంతు సహాయం ఉంటుందని, ప్రైవేట్ పాఠశాలల యాజమన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శివయ్య, ప్రెసిడెంట్ మహేష్, సెక్రటరీ రవి, కోశాధికారి గోవర్ధన్, మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం మూసాపేట ఆంజనేయనగర్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ నాగరాజు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈఎన్‌టీ, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. అలాగే బీపీ, జీఆర్‌బీఎస్, పీఎఫ్‌టీ (పల్మనాలజీ ఫంక్షన్ టెస్ట్), ఆడియోమెట్రీ (హియరింగ్ టెస్ట్) జరుపుతారని పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

మూసాపేట: మూసాపేటలో చిత్తారమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ పారడైజ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 500 మందికి ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు చేశారు. ప్రముఖ వైద్యులు, నిపుణులు సమాజానికి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి మార్గదర్శకులైన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. విద్యారంగానికి విశేష సేవలందించిన గురువులను లయన్స్ క్లబ్ నాయకులు సత్కరించారు. కార్పొరేటర్ శిరీష బాబూరావు, కోడిచర్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మహేందర్, లయన్స్ క్లబ్ జిల్లా 320 హెచ్ గవర్నర్ గంపా నాగేశ్వరరావు, లయన్ మనోహర్ రెడ్డి, కల్లూరి శ్రీనివాస్, రీజియన్ చైర్‌పర్సన్ టి.టి. రెడ్డి, ఎంఎస్ ప్రకాష్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ పారడైజ్ అధ్యక్షులు చంద్రమోహన్ నరేసేపల్లి, కాసం శ్రీనివాస్, ప్రాజెక్టు చైర్మన్ శ్రీధర్ చందన్, ప్రాజెక్ట్ కో చైర్మన్ రమేష్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ పురోగతికి యువత సహకారం అందించాలి

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: దేశ పురోగతికి యువత తమ వంతు సహకారం అందించాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా.రామేశ్వరరావు సూచించారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్‌లోని చాణక్య సెమినార్ హాల్‌లో శనివారం పీజీ విద్యార్థులు 2023–25 బ్యాచ్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేయడం, నిజాయితీ, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు జ్ఞాపకాలు, అనుభవాలు పంచుకున్నారు. అనంతరం నిర్వహించిన ఆటాపాట, సంగీత కార్యక్రమాలతో అదుర్స్ అనిపించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిజైన్ పరిశ్రమలో వినూత్న మార్పులు

ఐఐఐడీ సమావేశంలో నిపుణులు



సనత్‌నగర్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడీ) ఆధ్వర్యంలో బేగంపేటలోని ఐటీసీ గ్రాండ్ కాకతీయ హోటల్‌లో డిజైన్ పరిశ్రమలో ఉద్భవిస్తున్న ధోరణులపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఒకే వేదికపై ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు, ట్రేడ్ సభ్యులు, విద్యావేత్తలు హాజరై పరస్పరం తమ ఆలోచనలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఐఐఐడీ ప్రతినిధులు మాట్లాడుతూ.. 1996లో ప్రారంభమైన నాటి నుంచి 800లకు పైగా సభ్యులతో బలమైన రీజనల్ చాప్టర్‌గా ఎదిగిందన్నారు. డిజైన్ ఎక్సలెన్స్ అవార్డులు, ఫెలోషిప్ సమావేశాలు, విద్యార్థుల వర్క్‌షాప్‌లు, డిజైన్ వాక్స్, చాప్టర్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కాగా ఈ సమావేశంలో నూతన మేనేజింగ్ కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్‌గా రమేశ్‌పటేల్, సెక్రటరీగా సీఎస్ రాకేశ్‌వాసు, జాయింట్ సెక్రటరీగా గౌరవ్ పెర్షద్, కోశాధికారిగా నవీన్ కుమార్ చలసాని, సభ్యులుగా సుష్మిత సుబుధి, వందన ఆశిష్, భవంత్ ఆనంద్, కో–ఆపరేటెడ్ సభ్యులుగా సంజనషా, అమిత్‌షా, రోక్సానా చెహ్నా, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా శ్రీనాథ్, అకౌంటెంట్‌గా జబ్బార్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ పూర్వ విద్యార్థికి ప్రతిష్టాత్మక ఫెలోషిప్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థికి ప్రతిష్టాత్మక ఫెలోషిప్ మంజూరు అయింది.హెచ్‌సీయూలో 2018–20 బ్యాచ్ ఎంఏ హిస్టరీ పూర్వ విద్యార్థి గణేష్ పుత్తూర్‌కు బెంగళూరులోని ఫౌండేషన్ ఫర్ ఇండియన్ హిస్టారికల్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ద్వారా స్థాపించబడిన ప్రతిష్టాత్మక సర్ జాదునాథ్ సర్కార్ ఫెలోషిప్ ఫర్ ఇండియన్ హిస్టరీ లభించింది. ఈ ఫెలోషిప్ కింద రూ.15 లక్షల గ్రాంట్‌ను అందిస్తారు. భారతీయ చరిత్రలో పరిశోధన, రచనలు ప్రోత్సహించడానికి ఈ ఫెలోషిప్ రూపొందించబడింది. కాగా గణేష్‌ను హెచ్‌సీయూ హిస్టరీ విభాగం ఫ్యాకల్టీ, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

బతుకమ్మ వేడుకలకు సన్నాహాలు షురూ!



వెన్నెలగడ్డ ఎన్న చెరువు వద్ద కోనేరు

జగద్గిరిగుట్ట: రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలకు ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో గ్రేటర్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఈ వేడుకలను ఘనంగా జరిపేందుకు సిద్ధమయ్యారు. కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో వేడుకలకు సకాలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల ఆరవ తేదీన వినాయక నిమజ్జన కార్యక్రమాలు పూర్తికావడంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న కోనేరులు చెరువుల చెంత పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో బతుకమ్మ సంబరాలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నత అధికారులకు పంపినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ప్రాంతాలు ఇవే..

గాజులరామారం సర్కిల్ పరిధిలోని లింగం చెరువు ప్రాధాన్యత ఇస్తూ బేబీ పాండ్ శ్రీనివాస్ నగర్, భగత్ సింగ్ నగర్, చంద్ర నగర్, వివేకానంద నగర్, బీరప్ప నగర్, రింగ్ బస్తీ, సీసాల బస్తీ, చంద్రగిరి నగర్, ఉషోదయ కాలనీ, ఇద్దరమ్మా దేవి నగర్, గాజులరామారం చిత్తరమ్మ ఆలయం, రామ్ నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిష్టప్ప పేర్కొన్నారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ప్రధాన చెరువు వెన్నెలగడ్డ ఎన్న కాగా ప్రత్యేకంగా రంగారెడ్డి నగర్ డివిజన్ ప్రాంతంలో గిరి నగర్, గురుమూర్తి నగర్, నందానగర్, ఇందిరా గాంధీ నగర్, ఆదర్శనగర్, సంజయ్ గాంధీ నగర్, పంచశీల కాలనీ, రంగారెడ్డి నగర్, గాంధీనగర్, మారుతీ నగర్, వెంకట్రామిరెడ్డి నగర్ ప్రాంతాలు ఉన్నాయని అదే విధంగా సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని తెలుగు తల్లి నగర్, మరాఠీ బస్తీ, మైత్రి నగర్, సూరారం, రాజ్యలక్ష్మి నగర్, భగత్ సింగ్ నగర్, అపురూప కాలనీ, సుభాష్ నగర్ ఫేజ్ 1 ప్రాంతాల్లో ప్రత్యేకంగా బేబీ పాంట్లను ఏర్పాటు చేసినట్లు సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీ గణేష్ తెలిపారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మానగర్, బాపూనగర్, చెరుకుపల్లి కాలనీ, వాజ్పేయి నగర్, అంబేద్కర్ నగర్, మాణిక్య నగర్, ద్వారకా నగర్, దత్తాత్రేయ నగర్, గణేష్ నగర్, ఇంద్ర సింగ్ నగర్, బాల్ రెడ్డి నగర్ ప్రాంతాలతో పాటు జీడిమెట్ల డివిజన్లో ఎంఎం రెడ్డి నగర్, న్యూ వివేకానంద నగర్, అయోధ్య నగర్, రుక్మిణి ఎస్టేట్, భూమి రెడ్డి కాలనీ, శ్రీనివాస్ నగర్, కుత్బుల్లాపూర్ గ్రామం, బ్యాంక్ కాలనీ, జీడిమెట్ల విలేజ్, అంగడిపేట్, వేంకటేశ్వర కాలనీలలో ప్రత్యేకంగా బతుకమ్మ పాండ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రూ.18.70 లక్షల నిధులు మంజూరు

రూ.18.70 లక్షల నిధులు

కుత్బుల్లాపూర్ రూ.8.20 లక్షలు, గాజులరామారం రూ.10. 50 లక్షలు జంట సర్కిళ్లకు కలిపి 18 లక్షల 70 వేల రూపాయల నిధులను కేటాయిస్తూ గ్రేటర్ కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. ఆయా చెరువుల వద్ద చేయాల్సిన పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో లింగం చెరువు, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో వెన్నెలగడ్డ ఎన్నా చెరువు ప్రధానంగా ఉండగా ఆయా ప్రాంతాల్లో బేబీ పాండ్ ఏర్పాటు చేసి బతుకమ్మ వేడుకలు అనంతరం వాటిని తొలగించనున్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

కుత్బుల్లాపూర్‌లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ఆఫీసు పని ముగించుకుని ఇంటికి వెళ్లేవాళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపైన వర్షపు నీరు నిలవడంతో చాలా చోట్ల రాకపోకలు స్తంభించాయి. – సుభాష్‌నగర్



సుచిత్రలో కురుస్తున్న వర్షం



రోడ్లపై వరదనీరు చేరడంతో ఇబ్బందుల పడుతున్న ద్విచక్రవాహనదారులు



భారీ వర్షంతో ఆగిపోయిన ఆటోను నెడుతున్న ఆటోడ్రైవర్



జాతీయ రహదరి-44పై స్తంభించిన రాకపోకలు